క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాత లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

25న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 25న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రవికుమార్

అల్లిపురం: మద్యం మత్తులో ఆర్టీసీ కాంప్లెక్స్ దరి కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం విశాలాక్షినగర్‌కు చెందిన నడిగట్టు రవికుమార్(43) సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. తర్వాత మద్దిలపాలెంలో గల మహేంద్ర షోరూంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను తాగుడుకు అలవాటు పడ్డాడు. సోమవారం రాత్రి ఇంట్లో విజయనగరం వెళ్తున్నానని చెప్పి కాంప్లెక్స్ వచ్చాడు. మంగళవారం తెల్లవారి అతను కాలువలో పడి మృతి చెందిన విషయం గమనించిన ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని తండ్రి అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

బీజేపీ ఎంపీని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్

దాబాగార్డెన్స్: క్రీడల్లో పతకాలు సాధించి దేశానికి పేరు తెచ్చిన రెజ్లర్లపై బీజేపీ ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, అతనిపై చర్య తీసుకోవాలని, రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా మోదీ ప్రభుత్వం ఇంత వరకు ఏ చర్య తీసుకోకపోవడం దుర్మార్గమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం నిరసన చేపట్టింది. కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి. పద్మ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాల్సిన సమయంలో ప్రభుత్వ ఎంపీల నుంచే వారికి భద్రత లేకపోవడం అత్యంత హేయమన్నారు. వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐసీఈయూ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్, ఏపీ స్టేట్ వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ జి. సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

యథాతథంగా రహదారి సమస్య



షాదీఖానాలో ప్రజలతో చర్చలు జరుపుతున్న పోర్టు, జీవీఎంసీ అధికారులు

- పూర్తిగా వైదొలగడానికి ఆరు నెలల సమయం కోరిన పోర్టు అధికారులు
- సీఎస్ఎఫ్ బలగాలతో ఐరన్‌పోల్స్ తొలగింపు

జగదాంబ: ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు రహదారిపై స్తంభాలు తొలగించారు. 39వ వార్డు కోటవీధి దరి జీవీఎంసీ రహదారిని పోర్టు ట్రస్ట్ ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో స్థానికులు పడుతున్న బాధలతో భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట వేస్తూ జీవీఎంసీ కమిషనర్ ఐరన్‌పోల్స్ ఏర్పాటుకు ఆదేశించారు. అయితే అంతలోనే వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో స్థానికులు నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో ఏడు రోజులుగా జీవీఎంసీకి, కోటవీధి ప్రజలకు మధ్య కూల్‌వార్ సాగింది. కానీ సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో సీఎస్ఎఫ్ బలగాలతో వచ్చి ఐరన్‌పోల్స్ తొలగించారు. దీంతో కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ స్థానికులతో కలసి ధర్నాకు దిగారు.

6 నెలల గడువు కోరిన పోర్టు..

మంగళవారం సాయంత్రం విశాఖ పోర్టు, జీవీఎంసీ అధికారులు, వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీసులు కార్పొరేటర్ సాధిక్, స్థానికులతో చర్చలు జరిపారు. వార్డులో షాదీఖానా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సాధిక్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యకు పూర్తిగా పరిష్కారం జరగాలని కోరారు. అనంతరం ప్రజలు అధికారులతో ముఖాముఖీ చర్చలు జరిపారు. ఈమేరకు పోర్టు సెక్రటరీ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం జ్ఞానాపురం నుంచి పోర్టు ముఖద్వారం సీహార్స్ జంక్షన్ వరకు ఫ్లైఓవర్ ఉందని దానిని పోర్టు టెర్మినల్ వరకు నిర్మించేందుకు ఆరు నెలలు వ్యవధి ఇవ్వమని కోరారు. ఇందుకు జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ పూర్వంగా కోరినట్టు తెలిపారు. దాని వలన రాకపోకలకు ఇబ్బందులు ఉండవని అన్నారు. తరువాత జీవీఎంసీ రహదారిని పూర్తిగా జీవీఎంసీకి అప్పగిస్తామన్నారు. దీనిపై జీవీఎంసీ జోన్-4 కమిషనర్ పోర్టు నుంచి సమయం కోరుతూ లేఖ రావడం నిజమేనని వివరణ ఇచ్చారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. రెండు సంవత్సరాల కిందట ఆరు నెలలు గడువు ఇవ్వమని కోరిన పోర్టుకి ఎనిమిది నెలలు గడువు ఇచ్చినా ఇప్పటికీ పూర్తి చేయలేదని మళ్లీ ఇప్పుడు ఎలా సమయం అడుగుతున్నారని ప్రజలు ప్రశ్నించారు. దీనిపై పోర్టు చీఫ్ ఇంజనీరు వేణుప్రసాద్ మాట్లాడుతూ అప్పుడు పనులు ప్రారంభం అవ్వలేదని, ఇప్పుడు పనులు జరుగుతున్నందున సమయం అడుగుతున్నట్టు తెలిపారు. అయితే పనులు పూర్తయ్యే వరకు కనీసం రాత్రి వేళల్లో అయినా వాహనాలు తిరక్కుండా చర్యలు తీసుకోవాలని అంతా కోరారు. దీనిపై పోర్టు సెక్రటరీ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం పోర్టు చైర్మన్ క్యాంప్‌లో ఉన్నారని, ఆయన రాగానే ఈ విషయం ఆయన దృష్టికి తీసుకెళ్తానన్నారు. అప్పుడు మరోసారి చర్చలు నిర్వహించుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ ఆపరేషన్స్ అండ్ సెక్యూరిటీ ఇన్‌చార్జి ఎంఎస్ రావు, వన్‌టౌన్ సీఐ రేవతమ్మ, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జి ఏసీపీ వినయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథల కోసం..



తాము తయారు చేసిన వస్తువులు విక్రయిస్తున్న చిన్నారులు

సీతమ్మధార : అనాథ పిల్లల కోసం నలుగురు విద్యార్థినులు కృషి చేయడంపై ప్రతి ఒక్కరు అభినందనలు తెలుపుతున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు చెందిన స్వాతి ప్రమోటర్స్ సంస్థ చైర్మన్ రమేష్‌రెడ్డి కుమార్తెలు లక్ష్మీ స్వాతి, లక్ష్మీ క్షీరజతో పాటు సాత్విక, హేమ స్వహస్తాలతో తయారు చేసిన కొవ్వొత్తులు, పెయింటింగ్స్, కీచైన్స్, జ్యూయలరీ వస్తువులు పర్యాటకులు వచ్చే ఆర్కే బీచ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో విక్రయించారు. అనాథ పిల్లలు, విద్యార్థుల అవసరాల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా రూ. 16 వేలు సేకరించారు. మధురవాడలోని అమ్మఒడి అనాథాశ్రయంలో ఉన్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ఇతర వస్తువులు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. చిన్నారుల్లో ఉన్న మానవత్వాన్ని చూసి పలువురు అభినందిస్తున్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పలు సమస్యలపై వార్డు ప్రజలు ఆయనకు వినతులు అందించారు. ఈ సందర్భంగా 41వ వార్డు జ్ఞానాపురానికి చెందిన ఈసరి కనకమహాలక్ష్మి పిల్లల ఫీజుల నిమిత్తం రూ. 5 వేలు ఎమ్మెల్యే అందించారు. 27వ వార్డు, అక్కయ్యపాలేనికి చెందిన బొట్టా అనిల్ ట్రైన్ ప్రమాదంలో గాయపడినందున అతని తల్లి సరస్వతికి మందుల ఖర్చుల కోసం రూ. 2 వేల ఐదు వందలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి , కళింగ వైశ్య డైరెక్టర్ సకాలభక్తుల ప్రసాదరావు, అజయ్ రెడ్డి, సచివాలయ సెక్రటరీలు, గృహసారథులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ, మంత్రిని అరెస్టు చేయాలి




జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార : దేశానికి పతకాలు, పేరు ప్రతిష్టలు తెచ్చిన భారత స్టార్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఏపీ మహిళా సమాఖ్య, పీవోడబ్ల్యు, సీఎంఎస్ విశాఖ జిల్లా మహిళా సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించే విధానాలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షులు వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రోహిణి, కార్యదర్శి ఇందిర, జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు మేలు



సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నారాయణరావు



23వీఎస్‌సీ39: ఎంజీఎం హైస్కూల్లో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు పరిధి ప్రకాశరావుపేట పాఠశాలలో మంగళవారం ఆ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. భారత్ కరాటే అసోసియేషన్ ఏర్పాటు చేసిన క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జూన్ 5వ తేదీ వరకు కొనసాగే సమ్మర్ క్యాంపును విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, భారత్ కరాటే అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంజీఎం హైస్కూల్లో..

అల్లిపురం: విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చే నిమిత్తం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్ వంటి క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చిన్నారులకు గుడ్లు, పండ్లు, బిస్కట్లు అందజేస్తారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృ భాష పట్ల అవగాహన కలిగి వుండాలి

మాతృ భాష పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని ప్రథమ ఇనిస్టిట్యూట్ తెలుగు ఉపాధ్యాయురాలు జి.అనురాధ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సూర్యాబాగ్ కేంద్ర గ్రంథాలయంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తెలుగు కథలు విద్యార్థులకు చదివి వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ ఎస్.అచ్యుత, డిప్యూటీ లైబ్రేరియన్ ఇన్‌చార్జి పీవీఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో..

యు లవ్ రీడింగ్ కార్యక్రమంలో భాగంగా రీసోర్స్‌పర్సన్ వి.గురుమూర్తి పాల్గొని పుస్తకాలను స్నేహితులుగా భావించాలని విద్యార్థులకు సూచించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో స్పందన



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డీవో హూస్సేన్ సాహెబ్

మహారాణిపేట : మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్‌సాహెబ్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నాలుగు వినతులు వచ్చినట్లు మహారాణిపేట తహసీల్దార్ పి.ఆనందకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం



వలంటీర్లను సత్కరిస్తున్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: సేవే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నియమించిన వలంటీర్ల సేవలు నిరుపమానమని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రతో సత్కరించిన నేపథ్యంలో ఆమె వార్డులో అచ్చియ్యమ్మపేట సచివాలయంలో మంగళ వారం జరిగిన కార్యక్రమంలో వలంటీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, కన్వీనర్ అనిల్, యాసరపు రాజు, నర్సింగరావు, సత్తిరాజు, దూడ అప్పారావు, భాస్కరరావు, వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, సచివాలయం అడ్మిన్ మహేష్, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం



విశేష అలంకరణలో శ్రీ ధర్మశాస్త

అల్లిపురం: టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మ శాస్త (అయ్యప్పస్వామి)కి ఈ నెల 25,26 తేదీల్లో మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీవీఎస్ మూర్తి, గురుస్వామి నీలాపు రమణారెడ్డి, ఎల్.ఎ.సుకుమార్ తెలిపారు. టీటీడీ అధర్వణ వేద పండితులు అక్కాజ్యోస్యుల రమేష్‌శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 108 కలశాలతో శోభాయాత్ర ఉంటుందని తెలిపారు.

కొత్తమ్మవారి ఘటాలు ప్రారంభం



అల్లిపురం వీధుల్లో తిరుగుతున్న అమ్మవారి ఘటాలు

అల్లిపురం: కొత్తమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నుంచి గ్రామంలో అమ్మవారి ఘటాలు ప్రారంభమయ్యాయి. ఈ ఘటాలు అమ్మవారి ప్రధాన పండగ ముగిసే వరకు గ్రామంలో తిరుగుతాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. సాంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాలతో మహిళలు వీధివీధి తిరిగుతారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, నీలాపు రమణారెడ్డి, అయ్యప్పరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కనకమ్మ భక్తులకు మజ్జిగ వితరణ



మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

దాబాగార్డెన్స్: చినవాల్తేరు గ్రామంలో వెలసిన కనకమహాలక్ష్మి (దుర్గ) వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మళ్ల మాధవ్ కామాక్షి సౌజన్యంతో మంగళవారం పెద్ద ఎత్తున భక్తులకు మజ్జిగ వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీవీ రామచంద్రరావు, పోతనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ప్రతి ఏటా కనకమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భక్తులకు సేవలందిస్తున్నట్లు పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జి. దేవుడుబాబు, బొడ్డేడ వెంకటలక్ష్మి, దొడ్డి రమేష్, పెంటకోట శ్రీలక్ష్మి, శ్రీదేవి, తాతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోడీ నిరంకుశ పాలనకు మూల్యం తప్పదు



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న క్యాబ్ యూనియన నాయకులు

సీతమ్మధార : మోడీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు హెచ్చరించారు. మంగళవారం అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 788వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకు అసహనం పెరిగిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు ఆపాలని లేని పక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, గోపీకృష్ణ, అప్పలరాజు, శివ, శ్రీనివాసులు, శ్రీను, ప్రసాద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ



ఫైలేరియా బాధితులకు కిట్లు అందజేస్తున్న డాక్టర్ కార్తీక్

సీతమ్మధార: ఫైలేరియా వ్యాధిగ్రస్తులు వ్యాధి తీవ్రత ఎక్కువ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో గల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాట్లాడుతూ ఫైలేరియా కారణంగా కాలు బాగా వాచిపోతుందని, వాపు తీవ్రతను బట్టి గ్రేడ్ 1, 2, 3, 4గా కేటాయిస్తారన్నారు. బాగా వాచిన కాళ్లను ప్రతి రోజూ సబ్బుతో శుభ్రం చేసుకుంటే వాపు పెరగకుండా, తదుపరి గ్రేడ్‌కు వెళ్లకుండా ఉంటుందన్నారు. ప్రతి రోజూ చేయాల్సిన ఎక్సర్‌సైజులు వివరించారు. అనంతరం ఫైలేరియా బాధితులకు యూపీహెచ్‌సీ వైద్యురాలు కార్తీక్ చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లంక శ్రీనివాసు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలమైన డంపర్‌బిన్లు

- అధ్వానంగా పారిశుధ్యం



అమ్మవారివీధిలో శిథిలమైన డంపర్ బిన్ పరిసరాలలో పేరుకుపోయిన అపారిశుధ్యం

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో పారిశుధ్యం అద్వానంగా ఉందని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపర్ బిన్లు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే వారు కరవయ్యారని ఆరోపిస్తున్నారు. చెత్తా చెదారం డంపర్ బిన్‌లలో వేసినా తిరిగి కిందకే చేరుకుంటుందని, కనీసం శుభ్రత పాటించటం లేదని, బ్లీచింగ్ కూడా చల్లడం లేదని వాపోతున్నారు. మరో పక్క వార్డులో జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. ఇప్పటికే డెంగ్యూ, మలేరియా కేసులు నమోదవుతున్నాయని మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్లు తెలియజేస్తున్నారు. కానీ పారిశుధ్య సిబ్బంది మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాడైన డంపర్ బిన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, వార్డులో బ్లీచింగ్ విరివిగా చల్లాలని కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్త తొలగింపు

రోడ్లు శుభ్రం చేస్తున్న రవికుమార్



వీధులు శుభ్రం చేస్తున్న జాతీయ అవార్డు గ్రహీత రవికుమార్

మహారాణిపేట : ప్రధానిగా మోడీ 9 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రపంచ పర్యావరణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నెహ్రూ యువ కేంద్రం, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, ప్రకృతి చికిత్సాలయం సహకారంతో 29వ వార్డు బుద్ధవరపు గార్డెన్స్‌లో రాజీవ్‌గాంధీ మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు. ముందుగా వార్డులో పేరుకుపోయిన చెత్త , మురుగు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తా చెదరాలు పేరుకుపోవడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలి విష జ్వరాలు, డయేరియా , దగ్గు, జలుబు, స్వైన్ ఫ్లూ, డెంగ్యూ విజృంభించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం యువ సమన్వయ అధికారి మహేశ్వరరావు, రామప్రసాద్, డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, గేదల శ్రీహరి, కొండమ్మ, బంగారమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ జర్నల్ చీఫ్ ఎడిటర్‌గా కృష్ణా కళాశాల అధ్యాపకుడు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రి రామారావుకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జువాలజీ స్టడీస్‌కు చీఫ్ ఎడిటర్‌గా ఆయన నియామకమయ్యారు. ఈ మేరకు సైన్స్ పత్రిక నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలు అధ్యాపకుడు కర్రి రామారావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రామారావు అనేక అంతర్జాతీయ ప్రచురణలు, పుస్తకాల రచనతో పాటు సైన్స్ పత్రికలకు సంపాదకుడిగా , పర్యవేక్షకుడిగా పని చేస్తున్నారన్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు స్టాఫ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజశేఖర్, రాజారావు పాల్గొన్నారు.

లోన్ పేరిట టోకరా

అల్లిపురం: ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే వ్యక్తి లోన్ ఇప్పిస్తానని చెప్పి కొంత మందిచే దరఖాస్తులు చేయించాడు. తర్వాత లోన్ రాలేదని చెప్పి లోన్ డబ్బును తన ఖాతాలో వేసుకుని మోసగించాడని బాధితులు మంగళవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం డాబాగార్డెన్స్‌కు చెందిన సెల్ ఎలెక్ట్ షోరూంలో రశ్విత్ అనే ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ తమను మోసగించాడని వి.నరేష్, పత్తి గోవిందరావు తెలిపారు. పత్తి గోవిందరావుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.50 వేలు, ఐసీఐసీఐ బ్యాంకులో రూ.50 వేలు, ఐడీఎఫ్‌సీలో రూ.50 వేలు లోన్ ఇప్పిస్తానని చెప్పి లాగిన్ చేశాడు. తర్వాత మీకు సిబిల్ స్కోర్‌లేదు లోన్ రాలేదని చెప్పాడు. కాని గత రెండు రోజులుగా బ్యాంకు నుంచి ఫోన్ చేసి లోన్ ఎమౌంట్ కట్టమని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. సదరు షోరూంకు వెళ్లి అడగ్గా రశ్విత్ పరారయ్యాడని, అతనిపై చాలా కేసులున్నాయని చెప్పడంతో బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు.